క్లుప్తంగా

స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌కుమార్‌గౌడ్

కొత్తూరు: పట్టణంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం పట్టణానికి చెందిన వినయ్‌కుమార్‌గౌడ్ అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆయనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్వాములు మాదారం నర్సింలుగౌడ్, మల్లేశ్, బాలు, సోమ్లానాయక్, విఠల్‌చారి, విష్ణుమూర్తి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు ప్లేట్లను అందిస్తున్న దాత

చేవెళ్ల: విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే అందరికీ నాణ్యమైన విద్య అందుతుందని దేవునిఎర్రవల్లి పాఠశాల హెచ్‌ఎం రాములు అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రామానికి చెందిన హరిజన పెంటయ్య అతని కుమారుడు రామకృష్ణతో కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు దాతలు వీటిని అందజేశారు. అనంతరం గ్రామస్తులు దాతను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఉపాధ్యాక్షుడు కె.శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, సభ్యులు, గ్రామస్తులు విఠల్‌రెడ్డి, జంగయ్యగౌడ్, బుచ్చయ్య, నర్సింలు, సత్యం, మల్లారెడ్డి, గోపాల్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీకి సహకరించండి

ఎంపీడీఓ అరుంధతి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ, తనిఖీ బృందం

కొత్తూరు: మండలంలో 2023–24 సంవత్సర కాలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను తనిఖీ చేయడానికి సామాజిక బృందం సభ్యులకు సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ అరుంధతి కోరారు. ఇందులో భాగంగా ఆమె కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో పాటు సామాజిక బృందం సభ్యులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి పనులు చేపట్టిన గ్రామాల్లో ఈ నెల 12 నుంచి రెండు విడతలుగా సామాజిక బృందం తనిఖీలు చేపట్టనున్నట్లు వివరించారు. కాగా వారికి స్థానికంగా ఉండే సిబ్బంది సహకరించి వివరాలు అందించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

షాబాద్: మండలంలోని సాయిరెడ్డిగూడలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున సమేత భ్రమరాంబ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా పూజలు, హోమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి మల్లికార్జున స్వామి భ్రమరాంబ స్వామివార్లకు పూజలు, నందీశ్వర, శికరధ్వజం, నవగ్రహ, నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఉత్సాహంగా 'సీఎం కప్' మండలస్థాయి పోటీలు
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, నాయకులు



షాద్‌నగర్‌రూరల్: మండలస్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: క్రీడారంగ అభివృద్ధి చేయడంతో పాటుగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సీఎం కప్–2024లో భాగంగా బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ క్రీడలకు నయాపైసా ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మినీ స్టేడియం నిర్మించుకున్నామని, మినీ స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. క్రీడాకారులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఎంఈఓ మనోహర్, ఎంపీడీఓ బన్సీలాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కొందుర్గు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే సీఎం కప్‌లో భాగంగా పలు రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బుధవారం సీఎం కప్ మండలస్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి తహసీల్దార్ రమేశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, రామయ్యగౌడ్, నరేందర్, గోపాల్, ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ, ఎంఈఓ గాయత్రి, ఎంపీఓ లాలయ్య, ఫిజికల్ డైరెక్టర్ స్వాములు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

శంకర్‌పల్లి: నిత్యం క్రీడలు ఆడడంతో మానసికోల్లాసంతో పాటు శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సీఎం కప్–2024 ముగింపు పోటీలను శంకర్‌పల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, ఎంఈఓ అక్బర్, ఇన్‌చార్జి పీడీ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. సీఎం కప్ మండలస్థాయి పోటీలను మండల కేంద్రంలో నిర్వహించారు. బుధవారం ఈ పోటీల ఫైనల్‌ను నిర్వహించగా జిల్లాస్థాయికి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బాలికల విభాగంలో 100 మీటర్లలో సుప్రియ, 200ల మీటర్ల విభాగంలో ఏ.వైష్ణవి, 400ల మీటర్ల విభాగంలో బి.వైష్ణవి, 800ల మీటర్ల విభాగంలో పాపిరెడ్డిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వర్షిత, షార్ట్‌పుట్ విభాగంలో వర్షితలు అర్హత సాధించారు. అదే విధంగా బాలుర విభాగంలో 100 మీటర్ల విభాగంలో శివకుమార్, కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, 200ల మీటర్ల విభాగంలో చైతన్య, 400ల మీటర్ల విభాగంలో విష్ణువర్ధన్‌లు పాపిరెడ్డిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, 800ల మీటర్ల విభాగంలో శ్రీనాథ్‌లు ఎంపికయ్యారు.



శంకర్‌పల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



కేశంపేట: పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

క్రీడలకు అధిక ప్రాధాన్యం

మొయినాబాద్: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు రెండోరోజు బుధవారం మండల పరిధిలోని చిలుకూరు గురుకుల పాఠశాల ఆవరణలో జరిగాయి. రెండోరోజు క్రీడలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, నాయకులు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మొయినాబాద్: క్రీడాకారులతో ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం



చేవెళ్లలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఇన్‌స్పెక్టర్ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద రెండ్రోజుల పాటు జరిగిన మండల స్థాయి సీఎం కప్ పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు సందర్భంగా పోటీలలో పలు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ పురన్‌దాస్, పీడీ నాగ సంధ్యతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని సూచించారు. గెలుపుఓటమిలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాందిగా మారుతుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు రాఘవేందర్‌రెడ్డి, జబినా, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఉపాధ్యాయులు ఆశీర్వాదం, ఆదర్శ పాఠశాల పీడీ అంజనేయులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలు సరికాదు

పీసీసీ అధికార ప్రతినిధి సతీశ్

మొయినాబాద్‌రూరల్: బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయిందన్న దాహంతో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సరికాదని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ద్వారా అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అసెంబ్లీలోనే మంత్రులతో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంపై ఆమోదించి తీర్మానంతో ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఏ ఒక్కరోజు అధికారికంగా ప్రకటించలేదని విమర్శించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం బీఆర్ఎస్ నాయకులకు తగదన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికి వదిలిన బీఆర్ఎస్ విమర్శలకు దిగడం ఇది సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

మండల విద్యాధికారి చంద్రశేఖర్



దివ్యాంగ విద్యార్థులతో ఎంఈఓ, ఎంపీడీఓ

కేశంపేట: దివ్యాంగుల అభివృద్ధికి, వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలో చదివే దివ్యాంగులతో పాటు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సరిఫికెట్లను మంజూరు చేస్తుందన్నారు. అర్హులు సదరంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు రవి, లోకేశ్వరి, రజిత, జ్యోతి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్సీకి ఆశీర్వచనాలు అందజేస్తున్న వేద పండితుడు

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవర్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సనాతన, హిందూధర్మ పరిరక్షణకు తనవంతుగా కృషిచేస్తానని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఆలయాల నిర్మాణాలు, ఇతర వసతుల కల్పనకు తనవంతు ఆర్థికసాయం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. తీగాపూర్ గ్రామంలో నిర్మించిన సీతారామచంద్ర పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం చూడముచ్చటగా ఉందన్నారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. అంతకుముందు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ నేతలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి



గీతాపారాయణం చేస్తున్న మహిళలు

చేవెళ్ల: దేశానికి జ్ఞాన సంపదను అందించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని ప్రముఖ వక్తలు గొల్పల్లి అంజిరెడ్డి, డాక్టర్ భాస్కర యోగిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం గీతా జయంతి సందర్భంగా గీతా యజ్ఞం, సామూహిక గీతా పారాయణం, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. భగవద్గీత ప్రముఖ్యతను భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఈ గీతను చదివితే వారికి సమాజంపై పూర్తి అవగాహన, జీవన విధానం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీ శేషయ్యకు ఘన నివాళి

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఎంపీ శేషయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కమ్మ సేవా సమితి అధ్యక్షుడు పాతూరివెంకట్‌రావు ఆధ్వర్యంలో ఎంపీ శేషయ్య 90వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శేషయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శరత్, వసంతరావు, నాగేశ్వర్‌రావు, పినపాక ప్రభాకర్, మల్లేశ్వర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, వెంకట్‌రావు, నాగేశ్వర్‌రావు, శివ మోహనరావు, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్

చేవెళ్ల: ఈ నెల 14, 15వ తేదీలలో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్ అన్నారు. మండలంలోని ఊరెళ్ల పాఠశాల వద్ద బుధవారం జిల్లా అకాడమిక్ కన్వీనర్ మహ్మద్ అక్బర్‌తో కలిసి మహాసభల వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిని సభలలో చర్చిస్తామన్నారు. ఈ మహాసభలు షాద్‌నగర్‌లోని ఠాగూర్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల శాఖ సభ్యులు ప్రవీణ్, నర్సింలు, వీరయ్య, యాదగిరి, ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం హెచ్‌ఎం గోపినాథ్ ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ స్కూల్ ఆడిటోరియంలో ఈ నెల 14న నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హతిరామ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులను సాధించుకుందాం

- కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరే వెంకటేశ్

చేవెళ్ల: కురుమలందరూ ఏకతాటిపైకి వచ్చి తమహక్కుల సాధనకు పోరాటం చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరే వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద బుధవారం కురుమ సంఘం నాయకులందరూ కలిసి ఈ నెల 14న నగరంలో ప్రారంభించబోయే రాష్ట్ర కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో కురుమలకు గుర్తింపుగా ఉండే సంఘం భవనాన్ని నగరంలోని కోకాపేటలో నిర్మించారని, ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కురుమలందరూ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కురుమల ఐక్యతను చాటిచెప్పేందుకు కూడా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం ఉపాధ్యాక్షులు దండు సత్తి, ఎర్ర మల్లేశ్, సాయినాథ్, కోశాధికారి పి.వెంకటేశ్, కార్యదర్శి తిరుమల కుమార్, సలహాదారులు పి.ప్రభాకర్, సభ్యులు రాములు, ప్రవీణ్, శంకరయ్య, మల్లేశ్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



భవన ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పట్టణం మీదుగా బస్సులు నడపండి

- ఆర్‌ఎంకు ఎమ్మెల్యే వినతి



ఆర్‌ఎం సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్సులను బైపాస్ రహదారి మీదుగా కాకుండా పట్టణం మీదుగా నడపాలని ఎమ్మెలే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ బస్సులను పట్టణంలో నుంచి నడపాలని కోరుతూ ఎమ్మెల్యే ఆర్‌ఎం సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగాలు చేసుకునే యువత ప్రతిరోజు పట్టణం నుంచి హైదరాబాద్‌కు వెళ్తారని, రాత్రి సమయంలో తిరిగి పట్టణానికి వస్తుంటారన్నారు. రాత్రి సమయాల్లో బస్సులు బైపాస్ రహదారిపై వెళ్తుండడంతో షాద్‌నగర్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను పట్టణం మీదుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయాణికులను ఇబ్బంది పెట్టకుండా ప్రధాన రహదారులలో బస్సులను కొనసాగించాలన్నారు. వెంటనే స్పందించిన ఆర్‌ఎం బైపాస్ నుంచి వెళ్తున్న బస్సులను షాద్‌నగర్ మీదుగా నడిపేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, నాయకులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని నందిగామ, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు ప్రభుత్వం రూ.24లక్షలతో నూతనంగా రెండు 108 అంబులెన్స్‌లను మంజూరు చేసింది. ఈ 108 అంబులెన్స్ సర్వీసులను బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలను అందించాలనే ఆలోచనతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి 108 అంబులెన్స్ సర్వీలను తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటిని కొనసాగిస్తూ మరిన్నీ 108 అంబులెన్స్‌లను మంజూరు చేస్తున్నారని, అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సర్వీస్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



108 సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సీపీఐ బలోపేతానికి కృషిచేయాలి

పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కష్టజీవులకు అండగా ఉండే పార్టీ సీపీఐ అని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సీపీఎం మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలని సూచించారు. ఎర్రజెండా అంటేనే పేద కార్మిక, కర్షకుల పార్టీ అని, పేదలకు నిరంతరం అండగా ఉంటూ పోరాటం చేస్తుందన్నా రు. పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయా లని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్య దర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు మంజుల, బాబురావు, పెంటయ్య, రమాదేవి ఉన్నారు.



పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు